# పెళ్ళిచూపులు

సిహెచ్.వి. బృందావనరావు

వారం రోజుల్నించి రవీంద్రకు నిద్రపట్టడం లేదు. ఒకే ఆరాటం. అవమానం జరిగిందనే భావనతో మనస్సులో గింజుకుంటున్నాడు. అన్నం తినాలనిపించడంలేదు. మిత్రులతో గడపాలనిపించడంలేదు. దెబ్బతిన్న పాము పుట్టలోనే సుళ్లుతిరుగుతున్నట్టు, అశాంతితో రాజుకొంటున్నాడు.

రవీంద్ర యం.టెక్. పాసయ్యాడు. ఓ మంచి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అందగాడు. ఐదడుగుల పదంగుళాల ఎత్తున్నాడు. ఇరవై ఏడేండ్ల వయస్సు... మంచి ఉద్యోగం, మంచి సంపాదన. బాదరబందీల్లేవు. తండ్రి చిన్నపుడే పోతే తల్లే పెంచి పెద్దచేసింది. ఒకరకమైన ఆస్తిపరులు కూడా. ఇప్పటి సమాజపు వ్యవహారాన్నిబట్టి చూస్తే - రవీంద్ర మోస్ట్ ఎలిజిబుల్ బాచిలర్. అతనికి పెండ్లి సంబంధాలు వస్తున్నాయి. ఈ లోపల కనీసం ఐదు సంబంధాలు చూసాడు.



రవీంద్రకు తనమీద తనకు గొప్ప విశ్వాసం ఉంది. తనకు మంచి ఉద్యోగముంది, అందముంది, సంపాదనుంది. ఏ పిల్లయినా తన సంబంధమనగానే ఎగిరి గంతేసి ఒకే చెప్పాల్సిందేనని అతని ఫ్రెండ్సందరూ అంటుంటారు. కాబట్టి తొందరపడి ఏదో ఒక సంబంధం చేసుకోవలసిన ఖర్మ తనకేమీ లేదు. పెండ్లంటే తొందరపడి నిర్ణయం తీసుకునే విషయం కాదు

కదా. చాలా విషయాలు ఆలోచించుకోవాలి.

ఇంటర్‌నెట్‌లో తన వివరాలు తెలిసినం దున ఐతేనేమి, పెళ్లి బ్రోకర్ల చిట్టాల్లో తన వివ రాలు ఎక్కిపోయినందున వాండ్లద్వారా ఐతేనేమి చాలా సంబంధాలు వస్తూనే ఉన్నాయి. ఇప్పటికి ఐదు సంబంధాలు చూసాడు. ఏ ఒక్కటీ నచ్చ లేదు. ఆ అయిదింటినీ తిరస్కరించక తప్పలేదు.

గుంటూరు బ్రాడీపేటలో ఒక సంబంధం వుందని పిల్ల తరఫువాళ్లు వచ్చి, అమ్మాయి ఫొటో, ఇతర వివరాలూ ఇచ్చారు. ఫొటోలో బాగానే ఉంది అమ్మాయి. పేరు లలిత. యం.ఎస్సీ. పాసయింది.

తనూ, తల్లీ, తన స్నేహితుడు ప్రభాకరూ బయల్దేరదామనుకున్నారు అమ్మాయిని చూసి రావడానికి.

'ముగ్గురు పోగూడదురా. నాలుగో మని షుండాలి' అంది తల్లి.

'అయితే స్వర్ణక్కను కూడా తీసుకుపోదాం' అన్నాడు రవీంద్ర. స్వర్ణ ప్రభాకర్ భార్య.

అమ్మాయి తరఫువాండ్లు ప్రేమగా ఆహ్వానిం చారు. మంచిచెడ్డలు మాట్లాడుకున్నారు. టిఫి న్లు, కాఫీలూ అయిన తర్వాత అమ్మాయి వచ్చి కుర్చీలో కూచుంది. రవీంద్ర తల్లి, స్వర్ణా ఏవో ప్రశ్నలు వేసారు. సమాధానాలు చెప్పింది ఆ అమ్మాయి. ఓ ఏడెనిమిది నిమిషాలైన తర్వాత 'అమ్మాయినీ, అబ్బాయినీ కొంచెంసేపు ఒంట రిగా మాట్లాడుకోనియ్యండి' అన్నాడు ప్రభాకర్ లలిత నాన్నగారితో.


'ఓ అదేం భాగ్యం. ఇప్పుడది కూడా మా మూలే కదా' అని, ఆ ఏర్పాట్లు చేసాడు ఆయన.

మేడమీద గదిలో కొంచెంసేపు రవీంద్ర, లలితా ఒంటరిగా మాట్లాడుకున్నారు.

అక్కడి నుంచి బయల్దేరే ముందు, బయ టకు వచ్చిన తర్వాతా 'అమ్మాయి బాగానే ఉం దిరా. ఏం చెప్పమంటావు వాళ్లకు?' అంది తల్లి.

'ఇంటికి వెళ్లిన తర్వాత ఫోన్‌చేసి చెప్పొచ్చు గా' అన్నాడు ప్రభాకర్.

'అమ్మాయి కొంచెం రంగు తక్కువగా ఉంది. నచ్చలేదని చెప్పెయ్.



మళ్లీ ఇంటికి వెళ్లి చెప్తా మని నాన్చడం ఎందుకు' అన్నాడు రవీంద్ర. అక్కడి కక్కడే 'సారీ' అని చెప్పి వచ్చేసారు.

ఇంకో సంబంధం ఏలూరు పవర్‌పేటది. అమ్మాయి పేరు శ్రీకళ. ఎర్రగా ఉంటుంది. యం.కాం. పాస యింది. తల్లి దండ్రులకు ఒక్కతే కూతురు. అన్న దమ్ములు లేరు. ఈ అమ్మాయిని కూడా రవీంద్ర, అతని తల్లీ చూసొచ్చారు. తోడుగా ప్రభాకర్, అతని భార్యా కూడా పోయారు.

'పిల్ల చక్కగా ఉందిరా. చేసుకో' అంది తల్లి.

'మరీ అక్కచెల్లెండ్లు, అన్నదమ్ములూ లేని సంబం ధం ఎందుకమ్మా. మంచికీ

చెడుకీ బావమరుదులంటూ ఉండాలి కదా' అన్నాడు రవీంద్ర.

తల్లి కూడా అది నిజమే అనుకుంది. ఒక్కతే కూతురు కాబట్టి రవీంద్ర మీద అత్తమామల పెత్తనం ఎక్కువగా ఉంటుందని, తన ప్రాధాన్యత తగ్గిపోతుందనీ ఆమె భయం.

అలా ఆ సంబంధం కూడా కుదరలేదు.

అదికాక మరో మూడు సంబంధాలు చూసాడు రవీంద్ర. ఆ మూడింటిలో కూడా ఏదీ ఓకే చెయ్యలేదు. ఒకమ్మాయికి కండ్ల జోడుందని, మరో పిల్ల దగ్గరి బంధువుల్లో ఓ మానసిక వికలాంగుడున్నాడని, మరో పిల్ల తాను ఉద్యోగంచేసి తీరాల్సిందేనని కండిషన్ పెట్టిందనీ తిరక్కొట్టాడు.

'ఏదో ఒకటి సెలెక్ట్ చేసుకోరా. ప్రతిదానికీ వంకలు పెడితే ఎలా?' అన్నాడు ప్రభాకర్.

'అసలింతకీ ఈ యేడు పెండ్లి చేసుకుందామనుకున్నావా, లేదా? మాఘమాసం వెళ్లిందంటే ఇక దగ్గరలో ముహూర్తాలు కూడా ఉన్నట్లు లేదు' అంది ప్రభాకర్ భార్య స్వర్ణ.

'ఏం చెయ్యమంటావక్కా. నాకు మనసుకు పూర్తిగా నచ్చాలా, వద్దా. ఇష్టంలేకుండా ఎలా చేసుకోమంటావు?' అన్నాడు రవీంద్ర.

'ఇప్పటిదాకా నువ్వు చూసిన ఐదు సంబంధాలూ మంచివే. ఐదుగురూ చక్కని అమ్మాయిలు. బాగా చదువుకొన్నవారు. చిన్నచిన్న కారణాలతో వద్దనడం ఏమీ బాగులేదు. ముఖ్యంగా నచ్చలేదని మొరటుగా వాళ్ల మొహం మీదే చెప్పావు చూడు... అది కూడా ఏమాత్రం బాగాలేదు రవీ' అంది స్వర్ణ.

'అది నా స్వభావం అక్కా. విషయం నాన్చడం నాకు నచ్చదు. ఎదుటివాళ్లు బాధపడినా, మొహంమీద చెప్పడమే నా పద్ధతి' అన్నాడు రవీంద్ర.

ఆ తర్వాత నాలుగు రోజులకు మరో సంబంధం చూసాడు రవీంద్ర. అమ్మాయి చాలా బాగుంది. యం.సి.ఎ. అయి, ఏదో కంపెనీలో ఉద్యోగం కూడా చేస్తున్నది. అన్నదమ్ములున్నారు. మంచి కుటుంబం.

పెండ్లిచూపులయింతర్వాత ఇంటికి వెళ్లి ఏ సంగతీ తెలుపుతామని వచ్చేసారు.

'ఈ పిల్లయినా నచ్చిందర్రా' అన్నాడు ప్రభాకర్.

'నచ్చింది. ఓకే చెప్పెయ్యండి' అన్నాడు రవీంద్ర.

* * *

'నమస్కారం అన్నయ్యగారూ'... రవీంద్ర తల్లి ఫోన్‌చేసి అమ్మాయి తండ్రితో అంది.

'నమస్కారమమ్మా' అన్నాడు ఆయన.

'మీ సంబంధం మాకు నచ్చింది. మంచి రోజు చూసుకుని మీరు రండి. మాట్లాడుకుందాం' అంది.

"క్షమించండమ్మా. మా అమ్మాయికి మీ అబ్బాయి నచ్చలేదు" అని ఫోన్ పెట్టేసాడాయన.

నివ్వెరపోయారు అందరూ -

అదీ రవీంద్ర అశాంతికి కారణం. తనను... ఇన్ని అర్హతలు ఉన్న తనను ఓ అమ్మాయి కాదనడమా? ఎందుకు? ఎందుకని? చదువుంది, ఉద్యోగముంది, అందముంది, ఆస్తి వుంది, వయసుంది. ఏ కారణంతో ఒక అమ్మా

యి తనను తిరస్కరించింది - అర్థంకాలేదు రవీంద్రకు. తన సంబంధమంటే ఎగిరి గంతేసి ఏ ఆడపిల్లయినా ఒప్పుకోవల్సిన పరిస్థితుల్లో ఉన్నాడు తను. అలాంటి తనను ఎందుకు ఆ అమ్మాయి కాదన్నది? అప్పటి నుంచీ అవమానంతో రగిలిపోతున్నాడు రవీంద్ర.

ఇంకేవో రెండు సంబంధాలున్నాయంటే... ఇప్పుడు కాదులే అని. పెండ్లి ప్రయత్నాలకు విరామం ఇచ్చి, ఉక్రోషంతో ఘూర్ణిల్లుతున్నాడు రవీంద్ర.

ఓరోజు సాయంకాలం ప్రభాకర్ ఇంట్లో కూచుని ఉన్నాడు రవీంద్ర. ప్రభాకరూ.

కాఫీ అందించి 'ఏంటి రవీ. సీరియస్‌గా ఉన్నావు' అని అడిగింది స్వర్ణ.

'ఏంలేదక్కా. నాలో ఏం లోపం చూసి ఆ అమ్మాయి నన్ను కాదన్నదో అర్థంకావడంలేదు. చాలా అవమానం అనిపిస్తున్నది. నిద్రా పట్టడంలేదు. ఒకే అశాంతితో మనసంతా రగిలిపోతున్నది' అన్నాడు రవీంద్ర.

'నువ్వు ఐదుగురు అమ్మాయిలకు వాళ్ల మొహమ్మీదే నచ్చలేదని చెప్పేసావు. బాగా చదువుకున్న, మంచి అమ్మాయిలను కూడా అల్పమైన కారణాలతో తిరస్కరించావు. ఆ పిల్లలు ఎంత బాధపడి ఉండాలి? ఎంత అశాంతి పొంది ఉండాలి. ఎంత అవమానం దిగమింగుకుని వుండాలి? వచ్చిన సంబంధాలు అలా తప్పిపోతుంటే ఆ పిల్లల తల్లిదండ్రులు ఎంత క్షోభిల్లివుండాలి. ఇవ్వాళ నిన్ను ఒక మ్మాయి కాదనగానే తెగ బాధపడిపోతున్నావు. బాధ అందరికీ ఒకటే కదా' అంది స్వర్ణ.

తలదించుకొన్నాడు రవీంద్ర.

"వాళ్లు నాకు నిజంగానే నచ్చలేదు. నచ్చనివాళ్లను వద్దనుకునే స్వతంత్రం కూడా నాకుండదా?' అన్నాడు గిల్టీగానే.

'ఎందుకుండదు? తప్పకుండా ఉంటుంది. అదే స్వేచ్ఛ, నీవు నచ్చని అమ్మాయికి ఉండదా? అంది స్వర్ణ.

'చాలా సిల్లీ కారణాలతో ఆ అమ్మాయిలను తిరస్కరించావు. వాళ్ల ఆత్మాభిమానం ఎంత దెబ్బతిని వుండాలి? నీకంటే రంగు తక్కువని ఒకర్ని, కండ్లద్దాలున్నాయని ఒకర్ని, అన్నదమ్ములు లేరని ఒకర్ని, దూరబ్బంధువులలో ఎవరో మానసిక వికలాంగుడని మరో అమ్మాయిని... ఇలా చాలామందిని కాదన్నావు. నిజంగా ఇవన్నీ నువ్వు వద్దనాల్సినంత పెద్ద కారణాలేనా? నీకు డబ్బు, హోదా, ఉద్యోగం - అన్నీ ఉన్నాయి. సమాజంలో కొంచెం మంచి పొజిషన్‌లో ఉన్నావు. అందుకని కొంచెం అహంకారంగా ప్రవర్తించగలవు. నీకు ఓ అమ్మాయి ఎదురైంది. ఆమెకూ ఆస్తి, హోదా, ఉద్యోగం. అందం - అన్నీ వున్నాయి. ఏం, ఆమెకు అహంకారం వుండకూడదా? మగవాడికేనా ఆ ప్రివిలేజి? ఆమె నిన్ను కాదన్నదని మహా బాధపడిపోతున్నావు. ఎంత చదువుకున్నా, ఎంత అభ్యుదయంగా మాట్లాడినా, నేను మగవాణ్ని అనే దురహంకారం ఏమూలో మీలో తలెత్తుతూనే ఉంటుంది. అది చావదు. అది చచ్చిందాకా ఇలాంటి ఎమోషనల్ అప్‌సెట్స్ ఎదురౌతూనే ఉంటాయి" అంది స్వర్ణ.

తలవంచుకుని, దీర్ఘాలోచనలో పడ్డాడు రవీంద్ర.

* * *

ఈ ఘటన జరిగింతర్వాత, చూసిన మొదటి సంబంధమే ఏమీ ఇబ్బందుల్లేకుండా కుదిరిపోయింది రవీంద్రకు. ●